క్లుప్తంగా

నేడు ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం ప్రారంభం

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం చేస్తామని వెల్లడించారు.

స్విమ్స్‌లో ఈఎన్‌టీ వైద్య సేవలు విస్తృతం

తిరుపతి తుడా: స్విమ్స్‌లో ఉద యం ఏడు గంటల నుంచి 11 వరకు ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) వైద్య సేవలను విస్తృతం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఓపీ సే వలు ఉంటాయని, అలానే రోగుల సౌకర్యార్థం ఈ ఓపీ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. స్విమ్స్‌తో పాటు పద్మావతి మహిళా వైద్య కళాశాలలో కూడా ఈఎన్‌టీ వైద్య సేవలు కొనసాగుతాయన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

చంద్రగిరి: మండలంలోని రాయలపురం ఎస్‌ఆర్‌ఎస్‌టీ పిల్లలకు తొండవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చంద్రకళ గురువారం భర్త గోవిందయ్య జ్ఞాపకార్థం నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలలకు నాలుగు కుర్చీలు, విద్యార్థులకు భోజనం అందజేశారు. భవిత పాఠశాలలోని ప్రత్యేక ప్రతిభావంతుల అవసరాల కోసం ఎడ్యుకేషన్ కిట్లను అందజేసినట్లు ఎంఈఓ లలిత కుమారి తెలిపారు.

ప్రభుత్వంపై విమర్శలు విడ్డూరం

తిరుపతి కల్చరల్: దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వంపై జై భీమ్ పార్టీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ విమర్శలు చేయడం విడ్డూరమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. కుల, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందించడమేకాక దళితులను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కే దక్కిందన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలని, లేకుంటే యావత్ దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

తిరుమలలో హీరో గోపీచంద్



తిరుమల: ప్రముఖ సినీ నటుడు గోపీచంద్ గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఆయన చంద్రగిరి సమీపంలోని శ్రీవారి మెట్టు ద్వారా గంటన్నరలోనే తిరుమలకు చేరుకున్నారు. రాత్రి తిరుమలలోనే బస చేసి శుక్రవారం తిరుమల శ్రీవారిని నైవేద్య విరామ సమయంలో దర్శించుకుంటారు. ఆయనను చూసిన అభిమానులు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు.

గాయపడిన మహిళ మృతి

చంద్రగిరి: ఏ.రంగంపేటలో అగ్ని ప్రమాదంలో గాయపడిన మునిరాజమ్మ(53) గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఇంటిలోనే దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడింది. 108లో తిరుపతి రుయాకు, చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గురువారం తెల్లవారిజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



తిరుపతి గాంధీ రోడ్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం తిరుపతి తాతయ్యగుంటలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. చంద్రారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, మునికృష్ణ యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, చంద్రబాబు యాదవ్, గుట్ట నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల్లోనే ఉందాం.. ప్రజల కోసం పనిచేద్దాం

- నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం
- 7.5 లక్షల మంది ప్రజల్లోనే..
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే భూమన దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, నేతలు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

తిరుపతి మంగళం : 'నిత్యం ప్రజల్లోనే ఉందాం.. ప్రజల కోసం పనిచేద్దాం' అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఒక కల్యాణ మండపంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' అన్న బృహత్తర కార్యక్రమం ద్వారా శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రంలోని 5.5 కోట్ల మంది ప్రజల వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించినట్టు తెలిపారు. జగనన్న నాలుగేళ్లలో 60 శాతం పైన ఉన్న దిగువ మధ్య తరగతి కుటుంబాల కోసం రూ.3.5 లక్షల కోట్లలో రూ.230 లక్షల కోట్లను డీబీటీ ద్వారా నేరుగా వారి ఖాతాల్లో అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో జగనన్న చేస్తున్న మంచిని ప్రజలకు తెలియజెప్పి వారితోనే జగనన్నే మా భవిష్యత్తు అని చంద్రబాబుకు వినిపించేలా చెప్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 7.5 లక్షల మంది జేసీఎస్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిత్యం ప్రజల్లోనే ఉంటూ జగనన్న చేసిన మేలును వివరించడంతో పాటు వారికి మరిన్ని సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. తిరుపతి నగరంలో శుక్రవారం నుంచి ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లు, జేసీఎస్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారికి వైఎస్సార్ సీపీ చేసిన మేలును వివరిస్తామన్నారు. ఆ ఇంటిలోని వారి అనుమతితో జగనన్న స్టిక్కర్లను అంటించి గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, ఉదయగిరి రమేష్, మద్దాలి శేఖర్, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కో-ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర మహాయాగం



స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర మహాయాగం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో గురువారం స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర మహాయాగం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు, కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీ రమ్యానంద భారతీ ఆధ్వర్యంలో ఆస్థాన పండితులు రమేష్‌శర్మ, అర్చక బృందం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహాయాగంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, మాజీ కేంద్రమంత్రి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభి వాణీదేవి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం



తిరుపతి లీగల్ : రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు, తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత, తిరుపతి న్యాయవాదుల సంఘం మాజీ కార్యవర్గ సభ్యులు దినకర్, మురళీమోహన్, హరినాథనాయుడు తదితరులు శాలువతో సన్మానించారు. అలాగే రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలరావుకు న్యాయవాదులు స్వాగతం పలికి శాలువతో సన్మానించారు.

తిరుచ్చిపై సూర్యనారాయణ స్వామి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తిరుపతి నగర శాఖ అధ్యక్షుడు ఎస్.సురేష్ బాబు కోరారు. ఆయన గురువారం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో కలిసి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రుయా ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి, ప్రేమలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమనను కలిసిన ప్రభుత్వ వైద్యులు

తిరుపతి తుడా: ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు గురువారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని ఆయన ఇంటి వద్ద కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ టైంబౌండ్ ప్రమోషన్స్ స్కేల్స్ 2015 నుంచి ఇవ్వకుండా తొక్కి పెట్టారని, పీఆర్సీ అరియర్స్ కూడా మంజూరు చేయించాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాయుడు తోపాటు సభ్యులు డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ రవి శంకర్ పాల్గొన్నారు.

వేడుకగా గరుడ సేవ



వాహన సేవలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మొదటి సారి గురువారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి గరుడ వాహనపై కొలువుతీర్చి ఊరేగించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి గరుడ వాహనాన్ని స్వయంగా మోశారు. రంగస్థలి కళాకారులు పొన్నాల జేజిరెడ్డి, శాంభోలు హరినాథ్, గంగయ్య తదితరులు వేంకటేశ్వరస్వామి, గరుత్మంతుడు, ఆంజనేయస్వామి వేషధారణలో అలరించారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాసాన ప్రసాదరాజు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కేఎస్.రాజా, చెంగారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న చిద్విలాసం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం రాత్రి గరుడ వాహనంపై నాలుగు మాడవీధుల్లో విహరించారు. చైత్రమాసం పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామి గరుత్మంతుడిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

తిరుమల : మతిస్థిమితం లేని వ్యక్తి తిరుమలలో గురువారం హల్‌చల్ చేశాడు. తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్‌కు చెందిన మహేష్(25) కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వచ్చాడు. తిరిగి వెళ్లే సమయంలో తనకు మద్యం కొనిస్తేగాని రానని కుటుంబ సభ్యులతో గొడవపడి గోడపక్కకు వెళ్లాడు. టీటీడీ సెక్యూరిటీ గార్డ్ నరేష్ అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరూ గోడపై నుంచి కింద పడ్డారు. గాయపడిన ఇద్దరినీ అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మాదిగలకు సీట్లివ్వాలి

తిరుపతి కల్చరల్: రాయలసీమ జిల్లాల్లోని ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు సగం సీట్లు కేటాయించాలని రాయలసీమ మాదిగ రాజకీయ జేఏసీ అధ్యక్షుడు పీసీ.స్వామి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తమకు సగం సీట్లు కేటాయించాలని కోరారు.



ఎమ్మెల్యే భూమన జన్మదినం సందర్భంగా పేదలు ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నేతలు చిరంజీవిరెడ్డి, అనీల్ అందజేశారు. - తిరుపతి మంగళం

కలెక్టర్‌ను కలిసిన డీఎల్‌డీవో

తిరుపతి అర్బన్: చిత్తూరు డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ఆదిశేషారెడ్డి శ్రీకాళహస్తి డీఎల్‌డీవో బదిలీ అయ్యారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని కలిశారు.

ఇంటి ముంగిటకే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మోహిత్‌రెడ్డి

- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం

భాకరాపేట : రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందిస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఎర్రావారిపాళెం మండలం యల్లమంద పంచాయతీ దళితవాడలో 104 ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం అందక పేదలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జగనన్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. మారుమూల అటవీ ప్రాంతానికి సైతం క్షణాల్లో వెళ్లి వైద్యులు వైద్యం చేస్తారని పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం

రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లి పీహెచ్‌సీ పరిధిలోని నడవలూరు గ్రామంలో గురువారం వైద్యాధికారి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో సర్పంచ్ గణపతిరెడ్డి, ఎంపీటీసీ జ్ఞానమ్మ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దకే మెరుగైన వైద్యాన్ని అందించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినందన్నారు. డాక్టర్ భరద్వాజ్, సీహెచ్‌ఓ రాజమణి, ఎంపీహెచ్‌ఈఓలు రామక్రిష్ణ, వాట్కిన్స్, వీఆర్వో విజయభాస్కర్ , పాల్గొన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం

భాకరాపేట : పేదలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని జంగావాండ్లపల్లె సర్పంచ్ సింహాల విమల తెలిపారు. ఆమె గురువారం స్థానిక పంచాయతీ కేంద్రంలో 104 ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ తేజశ్వని, సూపర్‌వైజర్ వసంత, ఏఎన్ఎం జయంతి, ఎంపీహెచ్‌వో నస్రిన్ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం

చంద్రగిరి: రాష్ట్రంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. వారు గురువారం స్థానిక బీడీ కాలనీలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్స్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వైద్యులు కూడా ప్రతి గ్రామానికి వెళ్లి పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, సర్పంచ్ ముదికుప్పం రూప, ఉప సర్పంచ్ నగరి చంద్ర, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, నాయకులు దేవారెడ్డి, జిల్లా వైద్యాధికారిణి శాంతకుమారి, మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



జంగావాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సింహాల విమల

టీడీపీకి జనం మరో అవకాశం ఇవ్వరు



మంత్రి కొట్టు సత్యనారాయణ

తిరుమల: రాష్ట్ర ప్రజలు టీడీపీకి మరో అవకాశం ఇచ్చే యోచనలో లేరని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రాబోయే ఎన్నికలు వాస్తవానికి, అబద్ధానికి మధ్య యుద్ధంలా జరుగుతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిపక్ష నాయకుల్లో అయోమయం నెలకొందని పేర్కొన్నారు. వారు చేయలేని పనులను జగన్ చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. ప్రస్తుతం టీడీపీ వెంటిలేటర్‌పై ఉందన్నారు. ఎల్లో మీడియా టీడీపీని ఎత్తాలని చేస్తున్నా ఏం ప్రయోజనం లేదని వెల్లడించారు.

పల్లెలకూ ఆర్టీసీ సర్వీసులు



కంట్రోలర్స్‌కు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్: పట్టణాలు, నగరాలకే కాకుండా పల్లె ప్రాంతాలకు కూడా ఆర్టీసీ సర్వీసులు సక్రమంగా పంపాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి సూచించారు. డీపీటీఓ కార్యాలయంలో గురువారం ఆర్టీసీ కంట్రోలర్స్ సమావేశం ఆయన మాట్లాడుతూ బస్సుల ఆపరేటింగ్‌పై దృష్టి సారించాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్, ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల విషయంలో ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం ఇవ్వడంలో కీలక పాత్ర పోషించిన కంట్రోలర్స్ ఆవుల ప్రభాకర్ యాదవ్, తులసీరెడ్డిని అభినందించారు. ప్రశంసాపత్రాలు అందజేశారు.

రైల్వే ఏజీఎంగా తిరుపతి వాసి



ఆర్.ధనుంజయులు

తిరుపతి అర్బన్: తిరుపతికి చెందిన ఆర్.ధనుంజయులు దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా గురువారం సికింద్రాబాద్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు తిరుపతి వాసులు అభినందనలు తెలిపారు. ఆయన విద్యాభ్యాసం తిరుపతిలోనే పూర్తి చేశారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీసీ) 1988 బ్యాచ్‌కు చెందిన అధికారి. మొదట రైల్వేలో ఏరియా ఆఫీసర్/వాస్కోగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం రైల్వే ఆపరేషన్స్, సేఫ్టీ, కమర్షియల్ డిపార్ట్‌మెంట్లలో వివిధ హోదాల్లో పనిచేశారు. సెక్రటరీ జనరల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్‌గా విజయవాడ డివిజన్‌లో విధులు నిర్వహించారు. రైల్వే మౌలిక సదుపాయాల ప్రణాళిక రంగాలు, విధానాల రూపకల్పనలో పరిపాలనాధికారిగా విశేషమైన అనుభవం కలిగిన అధికారిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలోనే ఆయన దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు కలెక్టరేట్ నుంచి 2కె వాక్‌థాన్

తిరుపతి అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు 2కె వాక్‌థాన్ ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ వాక్‌థాన్ తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి నారాయణాద్రి ఆస్పత్రి వరకు సాగుతుందన్నారు.

విధులకు హాజరుకాని న్యాయవాదులు

తిరుపతి లీగల్ : ఢిల్లీలో న్యాయవాది వీరేంద్రకుమార్ హత్య, రాజమండ్రిలో ఓ న్యాయవాదితో పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ తిరుపతి న్యాయవాదులు గురువారం విధులకు హాజరుకాలేదు. దీంతో చాలా వరకు కేసులు వాయిదా పడ్డాయి. న్యాయవాదులకు ప్రభుత్వాలు అన్ని విధాలా రక్షణ కల్పించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

ఎయిడ్స్ బాధితులపై నిరంతర పర్యవేక్షణ

తిరుపతి తుడా: ఎయిడ్స్ బాధితులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంస్థ జాయింట్ డైరెక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన గురువారం తిరుపతిలోని విహాన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. బాధితులతో ఫోన్‌లో మాట్లాడి విహాన్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు.

నేడు న్యాయశాఖ ఉద్యోగుల సమావేశం

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమావేశం శుక్రవారం తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో నిర్వహించనున్నట్టు మండల న్యాయసేవా అధికార సంస్థ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 23న చిత్తూరులో నిర్వహించనున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సమావేశంలో చర్చించే అంశాలు, సభ్యుల చేరిక, నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

8న మదనపల్లిలో రాజ్యాంగ రక్షణ రణభేరి

తిరుపతి కల్చరల్: ఈనెల 8న మదనపల్లిలోని బీటీ కాలేజ్ గ్రౌండ్‌లో రాజ్యాంగ రక్షణ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఏపీ వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రభు తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇలాంటి దుశ్చర్యలను ఆపాలంటే 2024 ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రగతిశీల శక్తుల ఐక్య సంఘటన కోసం వీసీకే పార్టీ కృషి చేస్తోందన్నారు. రాజ్యాంగ రక్షణ రణభేరిని విజయవంతం చేయాలని కోరారు.

బార్‌లో యువకుల హల్‌చల్

చంద్రగిరి: తొండవాడ సమీపంలోని బార్‌లో గురువారం మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. నిర్వాహకుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం గాంధీపురానికి చెందిన కొంతమంది యువకులు బార్‌కు వచ్చి మద్యం సేవించారు. బిల్లు చెల్లించకుండా అక్కడున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకున్నారు. వారిని అడ్డుకోవడంతో సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు యత్నించారు. బిల్లు చెల్లించిన తర్వాతే వెళ్లాలంటూ సిబ్బంది అడ్డుకోవడంతో వారిపై దాడికి యత్నించారు. నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ హిమబిందు తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బార్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

పాకాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగునీటి వసతి, ఫ్యాన్లు, సరైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వారికి ప్రాథమిక చికిత్స అందించేందుకు ఇద్దరు ఏఎన్ఎంలను నియమించాలన్నారు.